నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 15 మే 2024 | VIKARABAD



స్ట్రాంగ్ రూముల వద్ద పోలీసుల బందోబస్తు

# లెక్కలు.. అంచనాలు

- చేవెళ్ల ఎన్నికలో గెలుపోటములపై సర్వత్రా ఆసక్తి
- గెలుపు ధీమాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు
- పోలింగ్ సరళిపై పార్టీ నేతలతో సమీక్షలు
- అంతుచిక్కని ఓటరు నాడి
- జూన్ 4న ఫలితం వెలువడే వరకు తప్పని నిరీక్షణ

రంగారెడ్డి, మే 14 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ఘట్టం ముగిసింది. ఇక కీలకమైన ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఎవరిని పలుకరించినా.. ఎక్కడ ఇద్దరు గుమికూడినా ఎవరు గెలుస్తారనే చర్చే జరుగుతున్నది. ఎన్నికల ఫలితాలపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. విజయావకాశాలపై ఎవరికి వారుగా అంచనాల్లో నిమగ్నమయ్యారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల బరిలో 43 మంది అభ్యర్థులు ఉన్నారు. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల లెక్కలు, ఆయా ప్రాంతాల్లో ఉన్న పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుని ఎవరికి వారుగా బయటకు ధీమాను వ్యక్తం చేస్తున్నప్పటికీ లోపల మాత్రం ఒకింత భయం పార్టీలను వెంటాడుతున్నది.

### అంతుచిక్కని జనం నాడి..

చేవెళ్ల ఎన్నికలో ఏ అభ్యర్థి గెలుస్తాడో ఎవ్వరూ అంచనా వేయలేకపోతున్నారు. ఎన్నికల ఫలితాలపై సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా చర్చ జరుగుతున్నది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు గందరగోళానికి తెరలేపుతున్నాయి. కొందరు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా చెబితే.. కొందరు అధికార కాంగ్రెస్ పార్టీకి, మరికొందరు బీజేపీకే ఆధిక్యం అని ప్రకటిస్తుండడం అటు నేతలను, ఇటు ప్రజలను సందిగ్ధంలో పడేస్తున్నాయి. పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ ఓటర్లే ఎక్కువగా ఈ ఎన్నికల్లో చైతన్యం చూపించారు. ఫలితంగా 2019 ఎన్నికల కంటే కాస్తంత ఎక్కువగా పోలింగ్ నమోదైంది. ఎక్కువగా నమోదైన పోలింగ్ ఎవరికి అనుకూలం? ఎవరికి ప్రతికూలం! అన్నదానిపై ఎవరికి వారుగా లెక్కలు వేసుకుంటున్నారు. ఏదిఏమైనా.. ఈ ఎన్నికల్లో కొంత మార్పు కనబడే అవకాశం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### ఎవరి ధీమా వారిదే..!

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ నుంచి రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి కొండ విశ్వేశ్వర్‌రెడ్డిలు పోటీ పడ్డారు. తొలి నుంచీ కాంగ్రెస్, బీజేపీలు ద్విముఖ పోటీగానే భావించాయి. ఆతర్వాత పరిస్థితులు మారడంతో త్రిముఖ పోటీ నెలకొన్నది. ఎవరికి వారుగా విజయావకాశాలపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల నుంచే లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించడం.. కేటీఆర్ రోడ్డు షోలు వంటి కార్యక్రమాలతో బీఆర్‌ఎస్ పార్టీ పుంజుకోవడంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయని నేతలు పేర్కొంటున్నారు. గత పదేండ్లల్లో బీఆర్‌ఎస్ పాలనతో కాంగ్రెస్ ఐదు నెలల పాలనను పోల్చుకుని ప్రజలు 'కారు' వైపే మొగ్గు చూపారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏదిఏమైనా.. నిశ్శబ్ద విప్లవంలో ఓటర్లు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఏ పార్టీవైపు మొగ్గు చూపారన్న విషయంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఈ ఉత్కంఠ వీడాలంటే జూన్ 4వ తేదీ వరకు నేతలు వేచి చూడక తప్పదు.



బండారి శ్రీనివాస్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అధికారులు



- పోటెత్తిన పల్లె జనం.. గడప దాటని పట్టణ ఓటర్లు
- 2019లో 53.25 శాతం.. 2024లో 56.40 శాతం
- గత ఎన్నికలతో పోలిస్తే.. 3 శాతానికిపైగా పెరిగిన ఓటింగ్
- స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు
- 144 సెక్షన్ నిషేదాజ్ఞలు అమలు

# పోలింగ్..పెరిగింది

రంగారెడ్డి, మే 14 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా.. పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపలేదు. 2019 ఎన్నికల్లో 53.25 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 56.40 శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే 3 శాతానికి పైగా ఓటింగ్ పెరిగింది. అత్యధికంగా చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 71.83 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా శేరిలింగంపల్లి సెగ్మెంట్‌లో 43.91 శాతం నమోదైంది. కాస్తంత పెరిగిన పోలింగ్ సరళితో ఎవరికి నష్టం! ఎవరికి మేలు! అన్నదానిపై రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. మరోపక్క అధికార యంత్రాంగం జూన్ 4న జరిగే కౌంటింగ్‌పై దృష్టి పెట్టింది. చేవెళ్లలో కౌంటింగ్ నిర్వహించనున్న బండారి శ్రీనివాస్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను పటిష్ట భద్రత నడుమ తరలించారు. 144 సెక్షన్ నిషేదాజ్ఞలను ఎన్నికల అధికారులు అమలు చేస్తున్నారు.

### స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు..

కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఓట్ల లెక్కింపు కేంద్రమైన చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుంచి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరి చూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని స్ట్రాంగ్ రూంలలో నియోజకవర్గాల వారీగా క్రమపద్ధతిలో ఉంచారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్‌కుమార్ కటారియాతో పాటు, అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములకు సీల్ వేశారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ సేహ్నాలు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూంలతోపాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేదాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్తు సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

**నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఇలా..**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | ఓటింగ్‌లో పాల్గొన్న | | | | |
|---|---|---|---|---|---|---|
| | | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం | శాతం |
| మహేశ్వరం | 5,56,741 | 1,50,807 | 1,42,656 | 09 | 2,93,472 | 52.71 |
| రాజేంద్రనగర్ | 6,12,170 | 1,73,356 | 1,57,959 | 03 | 3,31,318 | 54.12 |
| శేరిలింగంపల్లి | 7,58,102 | 1,75,609 | 1,57,226 | 18 | 3,32,853 | 43.91 |
| చేవెళ్ల | 2,69,960 | 99,389 | 94,521 | 01 | 1,93,911 | 71.83 |
| పరిగి | 2,66,566 | 90,155 | 88,480 | 02 | 1,78,637 | 67.01 |
| వికారాబాద్ | 2,31,639 | 82,604 | 80,556 | 07 | 1,63,167 | 70.44 |
| తాండూరు | 2,43,192 | 81,317 | 82,429 | 03 | 1,63,749 | 67.33 |
| మొత్తం | 29,38,370 | 8,53,237 | 8,03,827 | 43 | 16,57,107 | 56.40 |



# మహిళల్లో చైతన్యం

## వికారాబాద్ జిల్లాలో పెరిగిన పోలింగ్

- 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే 8.46 శాతం పెరిగిన ఓట్లు
- గత ఎన్నికలతో పోలిస్తే నాలుగు నియోజకవర్గాల్లోనూ పెరిగిన పోలింగ్
- అత్యధికంగా కొడంగల్ నియోజకవర్గంలో 11 శాతం మేర పెరిగిన పోలింగ్
- జిల్లావ్యాప్తంగా పోలైన 6,77,336 ఓట్లు
- జిల్లావ్యాప్తంగా పోలైన 3,37,685 మహిళా ఓట్లు
- తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో, పురుషుల కంటే మహిళా ఓట్లే అధికం
- తాండూరు నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్న 82,429 మంది మహిళలు
- కొడంగల్ నియోజకవర్గంలో పోలైన 86,220 మహిళా ఓట్లు

వికారాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో 8.46 శాతం మేర పోలింగ్ శాతం పెరిగింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 60.49 శాతం మేర పోలింగ్ శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 68.95 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోనూ గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం పెరిగింది. అత్యధికంగా కొడంగల్ నియోజకవర్గంలో 11 శాతం మేర పోలింగ్ పెరగడం గమనార్హం. వికారాబాద్ నియోజకవర్గంలోనూ దాదాపు 10 శాతం, పరిగి నియోజకవర్గంలో 6.04 శాతం, తాండూరు నియోజకవర్గంలో 8.33 శాతం మేర పోలింగ్ పెరిగింది. 2019 ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో 60.97 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 71.04 శాతం మేర, వికారాబాద్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 61.03 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 70.44 శాతం, పరిగి నియోజకవర్గంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో 60.97 శాతం మేర పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 67.01 శాతం, తాండూరు నియోజకవర్గంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో 59 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 67.33 శాతం మేర పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే మహిళా ఓటర్లు కూడా చైతన్యం ప్రదర్శించడం గమనార్హం.

### జిల్లాలో పోలైన 6,77,336 ఓట్లు..

పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 9,83,191 ఓట్లుండగా, 6,77,336 ఓట్లు పోలయ్యాయి. వీరిలో పురుషులు 4,85,210 ఓట్లుండగా.. 3,39,631 ఓట్లు, మహిళా ఓట్లు–4,97,946 ఓట్లుండగా.. 3,37,685 ఓట్లు, ఇతరుల ఓట్లు 35 ఓట్లుండగా.. 20 ఓట్లు పోలయ్యాయి. పరిగి నియోజకవర్గంలో 2,66,566 మంది ఓటర్లుండగా పురుషులు 1,33,568 మంది, మహిళలు 1,32,989 మంది ఓటర్లు, ఇతరులు 9 మంది ఓటర్లు ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో మొత్తం 1,78,663 ఓట్లు పోలుకాగా, వీరిలో పురుషులు–90,155 ఓట్లు, మహిళలు–88,480 ఓట్లు, ఇతరులు–9 ఓట్లు పోలయ్యాయి. వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,31,639 మంది ఓటర్లుండగా పురుషులు 1,14,965 మంది ఓటర్లు, మహిళలు 1,16,660 మంది ఓటర్లు, ఇతరులు 14 మంది ఓటర్లుండగా, పోలైన ఓట్లకు సంబంధించి వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం 1,63,167 ఓట్లు పోలుకాగా, వీరిలో పురుషులు–82,604 ఓట్లు, మహిళలు–80,556 ఓట్లు, ఇతరులు–7 ఓట్లు పోలయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో 2,43,192 మంది ఓటర్లుండగా, పురుషులు 1,17,821 మంది ఓటర్లు, మహిళలు 1,25,364 మంది ఓటర్లు, ఇతరులు ఏడుగురు ఉండగా, పోలైన ఓట్లకు సంబంధించి తాండూరు నియోజకవర్గంలో మొత్తం 1,63,749 ఓట్లు పోలుకాగా, వీరిలో పురుషులు–81,317 ఓట్లు, మహిళలు–82,429 ఓట్లు, ఇతరులు–3 ఓట్లు పోలయ్యాయి. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,41,794 మంది ఓటర్లుండగా, పురుషులు 1,18,856 మంది, మహిళలు 1,22,933 మంది ఓటర్లు, ఇతరులు ఐదుగురు ఓటర్లు ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 1,71,776 ఓట్లు పోలుకాగా, వీరిలో పురుషులు 85555 ఓట్లు, మహిళా ఓట్లు 86,220 ఓట్లు, ఇతరులు–1 ఓట్లు పోలయ్యాయి.

### జిల్లాలో మహిళా ఓటర్ల చైతన్యం..

జిల్లాలోని మహిళా ఓటర్లు చైతన్యం ప్రదర్శించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో జిల్లాలో మహిళా ఓటర్లే ఆధిక్యత ప్రదర్శించారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయినంత వరకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో భారీ క్యూ ఉన్నప్పటికీ ఓపికతో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం మహిళా ఓటర్లను చైతన్యవంతులను చేసేందుకు ఊరూరా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాన్నిచ్చాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 3,37,685 మహిళా ఓట్లు పోలయ్యాయి. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓట్లే అధికంగా పోలు కావడం గమనార్హం. పరిగి నియోజకవర్గంలో 88,480 మహిళా ఓట్లు, వికారాబాద్ నియోజకవర్గంలో 80556 మహిళా ఓట్లు, తాండూరు నియోజకవర్గంలో 82,429 మహిళా ఓట్లు, కొడంగల్ నియోజకవర్గంలో 86,220 మహిళా ఓట్లు పోలయ్యాయి.



చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ కళాశాలకు వివిధ నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన ఈవీఎంలు





మెట్రోరైలులో ప్రయాణికులు

# మెట్రో.. ఫుల్ రష్

- మూడ్రోజుల సెలవుల తర్వాత ఒక్కసారిగా పెరిగిన ప్రయాణికులు
- కిక్కిరిసిన ప్రయాణికులతో రోజంతా రద్దీ
- ఉదయం 5.30 గంటల నుంచే అందుబాటులోకి మెట్రో రైలు..

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): వరుసగా మూడు రోజుల సెలవులు, ఎన్నికల హడావిడి ముగియడంతో మంగళవారం తెల్లవారు జాము నుంచే నగరంలో మెట్రో సర్వీసుల కోసం క్యూ కట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో.. హైదరాబాద్‌కు వచ్చే వారితో పాటు నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లు కిటకిటలాడాయి. ముఖ్యంగా ఏపీ నుంచి వచ్చే వారితో ఎల్బీనగర్, ఉప్పల్ మెట్రో స్టేషన్లతోపాటు, సికింద్రాబాద్ మెట్రో స్టేషన్లకు భారీగా ప్రయాణికులు చేరుకున్నారు. సెలవులు ముగియడంతో ఉద్యోగరీత్యా ఇండ్లకు చేరుకునేందుకు మెట్రోను ఆశ్రయించినట్లు మెట్రో వర్గాలు పేర్కొన్నాయి. అయితే నగరానికి వచ్చే వారిని దృష్టిలో పెట్టుకుని ఉదయం 5.30గంటల నుంచి సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో మంగళవారం తెల్లవారు జాము నుంచే నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లు, బస్ స్టేషన్లతో పాటు, రైల్వే జంక్షన్లు కూడా వచ్చిపోయే ప్రయాణికులతో నిండి ఉన్నాయి. ఇక మంగళవారం ఆఫీసులకు వెళ్లే వారితో మెట్రోకు ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు తెలిసింది.

గత నాలుగు రోజులు జనాలు లేకపోవడంతో బోసిపోయి ఉన్న మెట్రో స్టేషన్లు, ఒక్కసారిగా రద్దీగా మారిపోయాయి. అదే సమయంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో జనాలు నిండిపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి నగరానికి చేరుకుని, ఇక్కడి నుంచి ఇండ్లకు చేరుకునేందుకు మెట్రోను ఆశ్రయించిన వారే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం నగరంలో ఆటో, క్యాబ్ ధరలతో పోల్చితే మెట్రో ద్వారా తక్కువ ఖర్చులో ప్రయాణించే వీలు ఉండటంతో రద్దీ పెరగడానికి కారణాలు చెబుతున్నారు. ప్రధాన మార్గాల్లోనూ మెట్రోకు ఆదరణ వస్తుండగా.. క్రమంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నట్లు మెట్రో గణాంకాల్లోనూ తేలింది.